# మేడిపండు - ఎ. సుధారాణి



అది శాస్త్రినగర్ కాలనీ. అక్కడ దాదాపు నలభై ఇళ్ళదాకా ఉంటాయి. అక్కడ ఉన్న వారందరూ కలిసి మెలిసి ఒకే కుటుంబ సభ్యుల్లా ఉంటారు. అయితే సుబ్బారావు కూడా పెళ్ళికాక ముందు అందరి తలలో నాలుకలా ఉండేవాడు. సుబ్బారావుకి ఈ మధ్యే పెళ్ళయింది. అతని భార్య సుందరి కాస్తో కూస్తో చదువుకున్న పిల్ల. కాలనీ వాళ్ళని చూస్తే చాలు అసహ్యించుకునేది. వాళ్ళందరూ సంస్కారం లేని వాళ్ళని ఆమె అభిప్రాయం. మొదట్లో ఆమెని చిన్నపిల్లగా భావించి ఊరుకునేవారు. పెద్దగా పట్టించుకునేవారు కాదు.

సుందరికి తన కాలనీ వాళ్ళ మీద సదభిప్రాయం లేకపోవడం వల్ల కొంచెం దూరంలో వున్న కాలనీ వాళ్ళతో పరిచయం పెంచుకుంది. ఇంకో కాలనీలో వుండే భూషణం కుటుంబంతో పరిచయం పెంచుకుంది. వాళ్ళింట్లో టి.వి, వి.సి.ఆర్ వుండడంతో వాళ్ళింటికి తరచూ వెళుతుండేది. అలా పరిచయం పెంచుకుని వాళ్ళింటికి వెళుతున్నపుడు ఏదైనా పిండివంటలు, క్రొత్త క్రొత్త వంటకాలు చేసి, తన ఇంట్లోవాళ్ళకి కూడా చెప్పకుండా భూషణం కుటుంబానికి తీసుకు వెళ్ళేది. ఆ రోజు తన యింట్లో గ్యాస్ అయిపోయింది. ముట్లాలు కూడా ఆ రోజే వూడిపడ్డారు. అయినా తనకేం భయం, ఇంతకు ముందోసారి ఇలా గ్యాస్ అయిపోతే భూషణంగారి యింట్లోంచి గ్యాస్ తెచ్చి పెట్టుకుంది. అప్పుడే పన్లోకి వచ్చిన నూకమ్మని వాళ్ళింటికి పంపించింది. వెళ్ళిన క్షణంలోనే సిలిండర్‌తో సహా తిరిగి వచ్చింది.

ఆరోజు సాయంత్రం తను చేసిన పులిహోర, బొబ్బట్లు తన క్యారియర్‌లో పెట్టుకుని టీవి చూడడానికి వాళ్ళింటికి బయలుదేరింది.

భూషణంగారి భార్య పెద్ద గొంతుకతో మాట్లాడడం వినిపిస్తోంది. మధ్యలో తన పేరు వినపడడంతో గుమ్మం వెలుపలే ఆగి వాళ్ళ మాటలు వినసాగింది.

"అది పిచ్చిపిల్ల, దాని కాలనీ వాళ్ళతో పడదు, అందుకే మనని పట్టుకుని వేళ్ళాడుతుంది. గ్యాస్ సిలిండర్ మనం కొద్దిగా వాడినది యిచ్చినా తెలుసుకోలేని మొద్దు ముఖం. పైగా ఇప్పుడు వాళ్ళింటికి ఎవరో వచ్చేరటగా... మనకి టిఫిన్ కూడా పట్టుకొస్తున్నానని కబురు పెట్టింది".

భూషణం భార్య భూషణంతో ఈ మాటలు అనడంతో సుందరికి వంటిమీద తేళ్ళు, జెర్రిలు పాకినట్టనిపించింది. వెంటనే తిరిగి ఇంటికి వచ్చేసింది.

మొదటిసారిగా సుందరిలో మానవత్వం మేలుకొంది.

ఆరోజు నుంచి అంతస్తులని చూసి విలువ ఇవ్వకుండా, గుణానికి విలువ నివ్వడం నేర్చుకుంది సుందరి.

## కవితా లహరి



### దృష్టి భేదించినచోట

నా ముందు
కన్నీటి జడులు కురుస్తున్నవి
ఉందుండి మంటలు లేస్తున్నవి
మనుష్యులై నను పలుకరిస్తున్నవి
ప్రశ్నిస్తున్నవి
మిత్రమా! క్షమించు
నీ వెంట వాహ్యాళికి రాలేను
మేఘాల వాహనాలపై విహారాలు చెయ్యలేను
ఈ నేలను నడిచి, నడిచి
ఈ గాలిని పీల్చి పీల్చి
ఈ గుండె విసికి విసికి
నా గొంతు గద్గదికమైనది
మిత్రమా! నేను వసంతగానం చెయ్యలేను
మట్టి బతుకుల మరిచి మనిషిగా
బ్రతుకలేను
గతం గాయమై, గరళమై
అడుగడుగునా సలుపుతూనే వుంది
ఊపిర్లను తెంచుతూనే వుంది
మిత్రమా! నేను భాధల్ని తప్ప పలుకలేను
గుండె లోతుల్ని తప్ప పలువరించలేను
నీకనిపించేది
గులాబీ చెక్కిళ్ళమీద మెరిసే మంచు ముత్యాలా
సాగర తరంగ మృదంగ స్వర విన్యాసాలా
క్షితిజ రేఖల్లో చిక్కుపడ్డ గజళ్ళు
నవ్వే కళ్ళల్లో నాట్యమాడే కవితా చరణాలా అయితే
నాకనిపించేది
సంకెళ్ళలో గులాబీలూ
అలలవెనుక అలజడులూ
హద్దుల్ని చెరిపేస్తూ ఉప్పొంగే చైతన్య స్రవంతులూ
ప్రశ్నించే కళ్ళను చల్లార్చే జిల్లేళ్ళను
జౌనంతే దృష్టి భేదించిన చోట
సాదృశ్యం కానరాదు
మార్గాలు చీలిన చోట
నవ్విన ప్రతి నవ్వు
వేసిన ప్రతి అడుగు
దూరాలను దాచలేవు

యాడగిరి